దగ్గుబాటిని కలిసిన ఆదిరెడ్డి అప్పారావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరానికి విచ్చేసిన మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావును మాజీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి అప్పారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వ్యక్తిగత వ్యవహారంపై నగరానికి వచ్చి షెల్టన్ హోటల్లో ఉన్న ఆయన్ను వారు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా వారు పలు రాజకీయ అంశాలపై చర్చించారు.

ఖర్చులతో బెంబేలు

- తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు
- భారం మోయలేమంటున్న కింది స్థాయి నేతలు
- నిబంధనల ప్రకారం ఒక అభ్యర్థి ఎన్నికల వ్యయం మొత్తం రూ.40లక్షల్లోపే ఉండాలంటున్న ఇసి

ప్రజాశక్తి-రాజోలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జనవరి నెల నుంచి ఎన్నికల సందడి మొదలైంది. టికెట్ల ఖరారు కాక ముందే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాలు మొదలుపెట్టారు.వివిధ రూపాల్లో ఓటర్లను కలుసుకునేలా కార్యక్రమాలు నిర్వహించారు. అభ్యర్థిగా ఖరారయ్యాక అందరినీ కలవడం సాధ్యం కాదనే ఉద్దేశంతో ముందుగానే ప్రచారాలు చేపట్టారు. ఏప్రిల్ రెండో వారంలో పోలింగ్ ఉంటుందన్న అంచనాతో అందుకు అనుగుణంగా సిద్ధమయ్యారు. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాష్ట్రంలో మే 13న ఎన్నికలు ఉంటాయని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించడమే ఇందుకు కారణం. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి 58 రోజులు ఉండడంతో అభ్యర్థులు అన్నిరోజులా అని అవాక్కయ్యారు. పోలింగ్‌కు ఇంకా సమయం ఉండడంతో అప్పటివరకు ప్రచారం ఖర్చులు, కార్యకర్తల వ్యయం, అనుచరగణాన్ని భరించడం ఎలాగనే ఆలోచనలో అభ్యర్థులు కొట్టుమిట్టాడుతున్నారు. కాకినాడ,తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్ .అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో అధికార పార్టీ, టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. ఎన్నికల్లో ప్రచారం చేసి ఓటర్లను ఆకట్టుకోవడానికి అన్ని పార్టీల నేతలు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. కొందరైతే ఎన్నికల కోడ్ వస్తే ఖర్చు చేసిన సొమ్ము లెక్కల్లోకి వస్తాయనే ఉద్దేశంతో ముందుగానే ఆయా సామాజికవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి వారి అవసరాలు తీర్చారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాలు సందర్శించి అక్కడికి అవసరమైన సౌకర్యాల కల్పనకు చేయూతనిచ్చారు. డిసెంబరు నెలలోనే వైసిపి కొందరు అభ్యర్థులను ఖరారు చేయడంతో వారు వివిధ వర్గాల ఓటర్లతో సమావేశాలు నిర్వహించి విందు భోజనాలు వడ్డించి అందరికీ బహుమతులు ఇచ్చి ఓటు వేయాలని కోరారు. వివిధ వత్తులు, వ్యాపారులు ఇలా ప్రతిఒక్కరినీ ప్రసన్నం చేసుకోవడానికి చేయని ప్రయత్నం లేదు. మహిళలు, క్షేత్రస్థాయిలో పని చేసే మహిళా ఉద్యోగులకు చీరలు పంపిణీ చేశారు. ఎన్నికల షెడ్యూల్ రాక ముందే కొన్ని నియోజకవర్గాల్లో వారు ప్రణాళిక ప్రకారం తాయిలాల పంపిణీ పూర్తిచేశారు. షెడ్యూల్ వచ్చినా ఏప్రిల్ రెండో వారంలో పోలింగ్ జరుగుతుందని అంచనా వేసుకుని అందుకు అనుగుణంగా ఖర్చులకు సొమ్ములు సిద్ధం చేసుకున్నారు. అనూహ్యంగా మే 13న పోలింగ్ తేదీ ప్రకటించడంతో మరో కొన్ని రోజుల పాటు ఖర్చులకు సొమ్ములు సర్దుబాటు చేసుకోవాలని అభ్యర్థులు మదనపడుతున్నారు. ఎన్నికల ప్రచార రథాలు, నేతలకు వాహనాలు సమకూర్చడం, కరపత్రాలు, జెండాలు, కార్యకర్తలకు భోజనాలు, అల్పాహారం ఇలా ప్రతిదానికి రూ.లక్షల్లో సొమ్ము ఖర్చవుతోంది. నెల రోజులు పెరిగినందున ఆ మేరకు ఖర్చు కూడా తడిసిమోపెడవుతుందన్న ఆందోళన అభ్యర్థులను వెంటాడుతోంది.

ద్వితీయశ్రేణి నేతలను నిలబెట్టుకోవడానికి..

అధికార పార్టీలో కొందరు అభ్యర్థులపై తీవ్ర వ్యతిరేకత ఉన్న క్రమంలో అక్కడి ద్వితీయ శ్రేణి నేతలు కూటమి అభ్యర్థుల వైపు మొగ్గుచూపుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించిన అధికార పార్టీ నేతలు వారికి ఆర్థికంగా చేయూత అందించి సర్దుబాటు చేసుకుంటున్నారు. పొరుగు నియోజకవర్గాల నుంచి బదిలీపై వచ్చిన అభ్యర్థులు స్థానిక ద్వితీయశ్రేణి నేతలను ప్రసన్నం చేసుకోవడానికి నానావస్థలు పడుతున్నారు. ఇప్పటి వరకు ఆయా నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహించిన ఎంఎల్ఎ వల్ల తాము ఇబ్బందులు పడ్డామని నేతలు చెబుతుండగా వారందరికీ ఆర్థికంగా ఇచ్చుకోవాల్సి వస్తోంది. పోలింగ్ త్వరగా జరిగిపోతే బాగుండనని అభ్యర్థులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

కార్యాలయాల ఏర్పాటుపై మీమాంస

ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు చాలాచోట్ల పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుంటారు. అక్కడి నుంచి కార్యకలాపాల నిర్వహణ, సమన్వయం చేసుకుంటారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఇప్పటికే కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామ, మండల, డివిజన్ల స్థాయిలో పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు అభ్యర్థులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇప్పుడే వాటిని ఏర్పాటు చేస్తే అద్దెతోపాటు నిర్వహణ భారంగా మారుతుందని భావిస్తున్నారు. ఏ పని చేయాలన్నా ఇంకా 45 రోజులు ఉందంటూ దాటవేత ధోరణి అవలంభిస్తున్నారు.

ఇవిఎంల బాక్సులను పరిశీలిస్తున్న సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

ఇవిఎంలకు పటిష్ట భద్రత

చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనా ఇవిఎంల గొడౌన్, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, రాజానగరం

ఇవిఎంలకు పటిష్ట భద్రత కల్పించాలని సిఇఒ ముఖేష్‌కుమార్‌మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజానగరం మండలాల్లో పర్యటించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత, ఎస్‌పి పి.జగదీష్, వివిధ రాజకీయా పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన ఎఫ్‌సిఐలో ఏర్పాటు చేసిన ఇవిఎం గొడౌన్‌ను, నన్నయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన వివిధ నియోజక వర్గాల కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత జిల్లాలోనీ ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోకి ఇవిఎంలు, వివి ప్యాట్స్, కంట్రోల్ యూనిట్స్‌ను భద్రపరిచామన్నారు. వివిధ నియోజక వర్గాలకు చెందిన పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఇవిఎంలు, అనుబంధ యూనిట్స్ విషయంలో తీసుకున్న భద్రత పరమైన అంశాలను సిఇఒకు వివరించారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఇవిఎంలు, ఇతర అనుబంధ యూనిట్స్ నన్నయ్య యూనివర్సిటీకి తీసుకొస్తామని తెలిపారు. వాటికి ప్రత్యేక రిసెప్షన్ కేంద్రం ఆయా నియోజక వర్గ స్ట్రాంగ్ రూమ్ సమీపంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్స్ రిసెప్షన్ కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూం వరకు తీసుకొచ్చే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కలర్ కోడ్ ఇస్తామన్నారు. సిఇఒ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని మాధవీలత తెలిపారు. గొడౌన్ నుంచి ఆయా నియోజక వర్గాలకు చెందిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే విధానం, తదితర అంశాలపై సిఇ సమీక్షించారు. తదుపరి రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. ఇవిఎం గొడౌన్ సందర్శన రిజిస్టర్‌లో సంతకం చేశారు. తొలుత ఆయనకు కలెక్టర్ మాధవీలత, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ్, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి తదితరులు స్వాగతం పలికారు. ఆయన వెంట ఎస్‌పి పి.జగదీష్, రాజమండ్రీ రూరల్ ఆర్ఒ, జెసి ఎన్.తేజ్‌భరత్, కొవ్వూరు ఆర్ఒ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, గోపాలపురం ఆర్ఒ కెఎల్.శివజ్యోతి, నిడదవోలు ఆర్ఒ ఆర్‌వి.రమణానాయక్ , ఎమ్.మాధురి, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసిఆర్.కృష్ణా నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భానుప్రకాష్, రెవెన్యూ, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'అల్లూరి సీతారామరాజు' నాటకం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట మండలం మల్లిసాల శివారు సింగరమ్మ అమ్మవారి దేవస్థానం ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వాతంత్ర్య సమరయోధుడు, అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు పడాల రామారావు రచించిన అల్లూరి సీతారామరాజు నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు దేవస్థానం కమిటీ చైర్మన్ తొట్టిపూడి నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన తెలుగు తల్లి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు నాటకాన్ని ప్రదర్శించడం, ఆ నాటక రచయిత పడాల రామారావు తనయుడు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ తెలుగుజాతి పౌరుష ప్రతాపాలను ప్రపంచానికి చాటిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. ఆయన నాటక ప్రదర్శనకు సింగరమ్మ అమ్మవారి దేవస్థానం కమిటీ అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. అల్లూరి, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.. చిన్నరులకు స్వాతంత్ర్య సమరయోధుల గురించి చెప్పాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అల్లూరి పాత్ర పోషించిన గోపు రాంబాబును పడాల అభినందించారు..

ఈస్టర్ సెలవు రద్దుపై కెవిపిఎస్ ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు

మణిపూర్ రాష్ట్రంలో ఈస్టర్ డే సెలవును రద్దు చేసిన బిజెపి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై కెవిపిఎస్ నిరసన వ్యక్తం చేసింది. మణిపూర్‌లో క్రిస్టియన్ల మనోభావాలు దెబ్బతినేలా గుడ్ ఫ్రైడే అనంతరం 30, 31తేదీల్లో సెలవుల్ని రద్దు చేయడాన్ని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు తీవ్రంగా ఖండించారు. మణిపూర్ రాష్ట్రంలో మొత్తం 9 జిల్లాలు ఉన్నాయన్నారు. వీటిలో ఐదు జిల్లాల్లో క్రైస్తవులు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 41.29శాతం క్రైస్తవ జనాభా ఉందని వీరంతా కుకీ కమ్యూనిటీకి చెందిన వారు తెలిపారు. గుడ్ ఫ్రైడే అనంతరం శని, ఆది వారాల్లో ఈస్టర్ ఘనంగా జరుపు కుంటారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని పక్కనబెట్టి మతోన్మాద శక్తులతో నడపబడుతున్న బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కుల కోసం నిలబడాల్సిందిపోయి కంచే చేను మేసినట్లు క్రైస్తవుల హక్కులపై దాడి చేయడం శోచనీయమన్నారు. ఇది రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. వెంటనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆమె తల్లితో టిడిపి నాయకులు

నల్లమిల్లికి టిడిపి నేతల బుజ్జగింపు

ప్రజాశక్తి- బిక్కవోలు, రాజమహేంద్రవరం ప్రతినిధి

మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని శుక్రవారం పలువురు టిడిపి నేతలు కలుసుకుని బుజ్జగించారు. టిడిపి జోన్-2 కో-ఆర్డినేటర్ సుజయ్ కృష్ణ రంగారావు, మాజీ మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప, ఎంఎల్ఎలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు నల్లిమిల్లి నివాసంలో శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఆయన తల్లి, ముఖ్యనాయకులతో చర్చించారు. నియోజక వర్గంలో పరిస్థితులను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామంటూ నాయకులు వెనుదిరిగారు. అనంతరం నల్లమిల్ల రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలో ఆయన తల్లితో కలిసి పర్యటించారు. ఆమెను రిక్షాలో కూర్చోబెట్టి నడుచుకుంటూ ఇంటింటికీ వెళ్లారు. కార్యకర్తలు, అనుచరులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాళ్లపూడి మండలంలో పలుగ్రామాల్లో టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు నామర పరమేశ్వరరావు మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, సుపరిపాలన అందించిన ఘనత టిడిపిదేనన్నారు. ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాళ్లపూడిలో నామన పరమేశ్వరరావు పెద్దదేవంలో టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు తిగిరిపల్లి గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మైగాపుల సంపత్, కిరణ్, సూర్య, మణికంఠ, రామారావు, బోడపాటి కాశి, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లిలోని** టిడిపి కార్యాలయంలో 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాట్రు భీమరాజు, కొండపల్లి దొరయ్య, గన్ని మణి, హరికృష్ణ, వైస్ ప్రెసిడెంట్ నడింపల్లి విజయ్‌కుమార్, ఉప్పులూరి రామారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **పెరవలిలో** టిడిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఆదేశాల మేరకు టిడిపి ఆవిర్భావదినోత్సవాన్ని నిర్వహించారు. టిడిపి రాజమండ్రి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రామాంజనేయులు మాట్లాడారు. తెలుగువాడి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన మహోన్నత వ్యక్తి ఎన్‌టిఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు రాపాక ప్రమీల, అతికాల రామకృష్ణమ్మ, సలాది కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ సలాది శ్రీహరి మురళీకష్ణ, అన్నవరం, రాధాకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో కేక్ కట్ చేస్తున్న గన్నికృష్ణ తదితరులు

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రాజమండ్రి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా తవ్వల వీరేంద్రనాథ్, పేలూరి రమేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా స్వర్ణపాప, జాయింట్ సెక్రటరీగా ధర్నాలకోట వెంకటేశ్వరరావు, లైబ్రరీ సెక్రటరీగా కొత్తపల్లి శ్రీనివాస్, ట్రెజరర్‌గా కర్ర హనుమంతరావు ఎన్నికయ్యారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ విభాగం కాశి శ్రీనివాసరావు, లేడీ రిప్రజెంటేటివ్‌గా కొండేటి వరలక్ష్మి ఎన్నికయ్యారు. 30 ఏళ్ల విభాగంలో పిఎల్ఎన్.ప్రసాద్, 20 ఏళ్ల విభాగంలో టి.ఆంజనేయులు, 10 ఏళ్ల విభాగంలో ఎం.సత్యపద్మ, 5 నుంచి 10 ఏళ్ల విభాగంగా వి.రామ్మోహన్‌రావు, పి.చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2 నుంచి 5 ఏళ్ల విభాగంలో బి.అరుణ్‌కుమార్, ఎంఆర్‌వివి.మణికంఠ ఎన్నికయ్యారు. ఎలక్షన్ అధికారులుగా కె.మల్లేశ్వరరావు, బి.సాయిబాబు, కెఎల్ భవాని, కెవివి.నర్సింహరాజు, ఎన్‌విఎస్ కళ్యాణ ఫణికుమార్, పిఆర్‌పి యాదవ్, ఎన్ఎస్ గణేష్, బి. మూర్తి ఎస్ ఎస్ శ్రీనివాస్ వ్యవహరించారు.నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

కార్టూ'నిజం'



గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గుడ్ ఫ్రైడే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలుచోట్ల రాజకీయ నాయకులు పాల్గొన్నారు. శిలువలతో ప్రదర్శనలను నిర్వహించారు. రాజమహేంద్ర వరంలో అన్ని చర్చిల్లో ఉదయం నుంచే ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. పలుచోట్ల క్రైస్తవులు ప్రదర్శనలను నిర్వహించారు. **గోపాలపురం**లోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో ఫాదర్ ముప్పిడి రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు శిలువను మోస్తూ ప్రదర్శన నిర్వహించారు. **దేవరపల్లి** మండలం గౌరీపట్నంలో టిడిపి కొవ్వూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు శిలువను మోస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యేసు క్రీస్తు చేసిన అపారమైన త్యాగానికి గుర్తుగా గుడ్ ఫ్రైడే జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలంలోని వేగేశ్వరపురం ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం జరిగిన జరిగిన శిలువ మార్గం కార్యక్రమంలో వైసిపి కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి, ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిలువను మోశారు. చర్చి ఫాదర్ జాన్, క్రైస్తవులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో శిలువ మోస్తున్న ఎంఎల్ఎ తలారి వెంకట్రావు

'టిడిపి నేతలు పొలిటికల్ దొంగలు'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

టిడిపి నేతలు పొలిటికల్ దొంగలు అని, ఎన్నికల సమయంలో వరాలు గుప్పించి, మాయ మాటలు చెప్పి ఓట్లు అడుగుతారని, గెలిచాక ముఖం చాటేస్తారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం నగరంలోని 40వ వార్డు సీతంపేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నగరంలో అభివృద్ధి జరిగిందని అనుకుంటేనే తనకు ఓటు వేయాలన్నారు. 2019కి ముందు రాజమండ్రి ఎలా ఉండేదో, వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎంత అభివృద్ధి చెందిందో చూసి తీర్పు చెప్పాలన్నారు. 2014లో టిడిపి ఎంపీ మురళీమోహన్ ఒక్కసారైనా ప్రజలవ వద్దకు వచ్చారా? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో రాజమండ్రి సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని నగరంలో కనిపించారా? అని ప్రశ్నించారు. అటువంటి వారిని పొలిటికల్ దొంగలు అనకపోతే ఏమనాలని ప్రశ్నించారు. రాజమండ్రిలో ఆదిరెడ్డి కుటుంబ సభ్యుల్లో ఒకరు మేయర్‌గా, మరొకరు ఎంఎల్‌సిగా, ఇంకొకరు ఎంఎల్ఎగా 16 సంవత్సరాల పాటు అధికారం అనుభవించారే తప్ప, నగరాభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ఇప్పుడు మళ్లీ అదే కుంటుంబం నుంచి ఎంఎల్ఎ పదవికి పోటీపడుతున్నారన్నారు. ఇదేమైనా వారసత్వ పాలనా అని ఎద్దేవా చేశారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను పెంచిపోషిస్తుంది ఆదిరెడ్డి కుటుంబమే అన్నారు. ఇలాంటి వారిచేతిలో నగరాన్ని పెడితే సంఘ విద్రోహక శక్తులు పెట్రేగిపోతాయన్నారు. తాను ఎంఎల్ఎగా గెలిస్తే సంఘ విద్రోహక శక్తులను ఉక్కుపాదంతో అణచివేసి, ప్రశాంత నగరంగా అభివృద్ధి చేస్తానని ఎంపీ భరత్ తెలిపారు.

బుర్రకథ ద్వారా ఓటుపై అవగాహన

ప్రజాశక్తి - గోపాలపురం

బుర్రకథ కళాజాతా ద్వారా గోపాలపురంలో ఓటు ప్రాధాన్యతపై అవగామన కల్పించారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఎన్నికల్లో ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఓటుహక్కులపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండినవారు తప్పకుండా ఓటరుగా నమోదు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు శ్రీనివాస్, లక్ష్మి పాల్గొన్నారు.

ఓటు విలువపై అవగాహనల కల్పిస్తున్న బుర్రకథ కళాకారులు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - చాగల్లు

ఆర్థిక ఇబ్బందులు తాళలేక చాగల్లుకు చెందిన బత్తిన శ్రీనివాస్(45) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీనివాస్ వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం రూ.4లక్షల వరకూ ప్రతివారం వాయిదా చెల్లించేలా అప్పు తీసుకున్నాడు. కూలి పనులు చేసుకుంటూ క్రమంగా వాయిదాలు కడుతున్నారు. రెండు వారాల క్రితం శ్రీనివాస్ పొలం పని చేస్తుండగా కాలుజారి పడడంతో చేయి విరిగింది. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నాడు. పనికి వెళ్లకపోవడంతో వాయిదాలు కట్టలేకపోయాడు. అప్పు చెల్లించాలని ఒత్తిడి ఎక్కువైంది. వాయిదాలు కట్టకపోతే అల్లరి చేస్తారేమోననే భయంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో గురువారం ఇంట్లోని కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించి అతని కుమారుడు పండు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ మేరకు చాగల్లు ఎస్ఐ పి.నాగరాజు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఉపాధి నిమిత్తం మస్కెట్‌లో ఉంటోంది. వివాహమైన కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆభరణాల చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఈ నెల 17న ఒక కళ్యాణ మండపంలో జరిగిన పెళ్లి వేడుకల్లో బంగారు ఆభరణాలను దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సర్పవరం సిఐ శ్రీనివాస్ తెలిపారు. సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక కళ్యాణ మండపంలో ఈనెల 17వ తేదీన ఒక వివాహానికి పిఠాపురం పట్టణానికి చెందిన నిందితుడు కె.వీర శంకర్ వచ్చాడు. అక్కడ సోఫాపై ఉంచిన హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి సుమారు 148 గ్రాముల మూడు బంగారు చైనులు దొంగలించాడు. దీనిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి సతీష్ కుమార్, డిఎస్‌పి కె.హనుమంతరావు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుని గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు.

అడవి పంది దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

పటవల గ్రామంలో అడవి పంది సంచరించి దాడి చేయడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ దాడిలో పటవల గ్రామానికి చెందిన మాసగిరి నాగబాబు అనే వ్యక్తి తొడపై అడవి పంది కరవడంతో తీవ్ర గాయం అయింది. గాయాల పాలైన నాగబాబును ఆసుపత్రికి తరలించారు. ఫారెస్ట్ అధికారులు అడవి పంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పేకాడుతున్న ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పేకాట శిబిరంపై ముమ్మిడివరం పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుండి నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని సిహెచ్.గున్నేపల్లి గ్రామంలో కొబ్బరి తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం ఎస్ఐ డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.6,810 నగదు మరియు ఐదు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-గండేపల్లి

పలు గ్రామాల్లో ట్రాన్స్ఫార్మర్ల చోరీకి పాల్పడిన నిందితుని అరెస్ట్ చేసినట్లు ఎస్‌క్మి నౌడు రామకృష్ణ తెలిపారు. ఏలేశ్వరం, గండేపల్లికి చెందిన పెంద్ర ప్రసాద్, అతడి బంధువైన పెంద్ర రవి గండేపల్లి మండలం జెడ్.రాగంపేట ఎర్రంపాలెం, పి.నాయికం పల్లిలో 12 ట్రాన్స్ఫార్మర్లను అపహరించారు. వాటిని అమ్మేందుకు రాజమహేంద్రవరం వెళుతుండగా పెంద్ర ప్రసాద్‌ను అరెస్టు చేశారు. పెంద్ర రవి పరారీలో ఉన్నట్టు ఎస్‌క్మి ఎన్ రామకృష్ణ తెలిపారు.

ఆభరణాలు, నగదు అపహరణ

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట జ్యోతుల నెహ్రూ కాలనీలో గురువారం రాత్రి ఒక ఇంట్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. కాలనీకి చెందిన అడబాల శ్రీను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తన బంధువులకు అనారోగ్యంగా ఉందని సామర్లకోట వెళ్లారు. గురువారం రాత్రి వీరు ఇంట్లో లేనీ సమయం చూసి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 10 కాసుల బంగారం, రూ.60 వేల నగదు అపహరించారని తెలిపారు. దీనిపై బాధితులు అడబాల శ్రీను, తన భార్య లీలా కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌క్మి నాగార్జున రాజు తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని ములగపూడిలో శుక్రవారం సత్య దేవా లయన్స్ క్లబ్ నాయకురాలు పర్వత జానకి దేవి పుట్టినరోజు సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు పర్వత వివేక్, సత్యదేవ లైన్స్ క్లబ్ నాయకులు పసగడుగుల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని 15వ వార్డులో టిడిపి, జనసేన, బిజెపిలకు చెందిన నాయకులు, కార్యకర్తలు శుక్రవారం వైసిపిలో చేరారు. ఆ పార్టీ రాజమహేంద్రవరం అర్బన్ అభ్యర్థి, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో వారు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇందిరా నగర్‌లో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో వీరంతా పార్టీ చేరారు. ఎంపీ భరత్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. ఇందిరా నగర్‌కు వచ్చిన భరత్‌కు మేళతాళాలతో, పూలవర్షం కురిపిస్తూ, మహిళలు హారతులు పడుతూ ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు పాలిక శ్రీను, నక్కా శ్రీనగేష్, ఎన్‌వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన 'టైగర్ ట్రయింప్' సైనిక విన్యాసాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, కాకినాడ రూరల్

భారత్, అమెరికా భద్రతా దళాల సంయుక్త సైనిక విన్యాసాలు నాలుగో రోజు శుక్రవారం ముగిశాయి. కాకినాడ సముద్ర తీరంలో '2024 టైగర్ ట్రయింప్' పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో ఇరు దేశాల ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సైనికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నెల 26 నుంచి విన్యాసాలు జరుగుతుండగా శని, ఆదివారాల్లో విశాఖపట్నంలో ముగుస్తాయని అధికారులు చెప్పారు. భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ ఐరావత్, ఐఎన్ఎస్ కేసరి యుద్ధనౌకలు, అమెరికా నౌకలు, హెలికాప్టర్లు మోహరించి విన్యాసాలు చేపట్టారు. భారత్ నుంచి 700 మంది, అమెరికా నుంచి 400 మంది సైనికులు పాల్గొన్నారు. రెండు దేశాల నౌకల మధ్య క్రాస్ డెక్ హెలికాప్టర్ ఆపరేషన్లు నిర్వహించారు. విన్యాసాలకు సంబంధించిన వివరాలను ఆర్ఎడిఎం మార్టినెజ్, మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్ వివరించారు. రెండు దేశాల మధ్య అవగాహన, అనుభవాలను పంచుకునేందుకు ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇరుదేశాలు మరింత కలిసి ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సామగ్రి తరలిస్తున్న యుద్ధ విమానాలు

విన్యాసాల్లో పాల్గొన్న ఇండో అమెరికన్ సైనికులు

యానాం వార్తలు

వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న సి ఎస్ శరత్ చౌహాన్

అధికారులతో సిఎస్ చౌహాన్ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్ శుక్రవారం యానాం అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్ష జరిపారు. ఆయన పుదుచ్చేరి సిఎస్‌గా బాధ్యతలు చేపట్టిన తరవాత తొలిసారి యానాం పర్యటనకు విచ్చేశారు. ఈ మేరకు స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి మునుస్వామి ఛాంబర్‌లో ఆయా శాఖల అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఆయా శాఖల వారీగా సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. అధికారులకు ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పరిపాలనాధికారి మునుస్వామితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద చౌహాన్ పరిపాలనాధికారితో కలిసి మొక్కలు నాటారు.

చెరువును చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అడుగంటిన మంచినీటి చెరువులు

ప్రజాశక్తి-యానాం

నియోజకవర్గ ప్రజలకు ఈ వేసవి తాగునీటి కష్టాలు తప్పేలా లేవు వేసవికి ముందే చెరువులు నింపి స్టోరేజ్ చేయాల్సిన అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే వేసవి మొదట్లోనే చెరువులు అడుగంటాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లాడి సత్తిబాబు, అర్ధాని దినేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులను తాగునీటితో పూర్తిగా నింపే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఊపందుకున్న ప్రచారాలు

జిల్లాలో అన్ని పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో జిల్లాలో ప్రచారాలు ఊపందుకున్నాయి. ఆయా పార్టీల అభ్యర్థులు ఓట్ల కోసం ఎండలను సైతం లెక్కచేయకుండా తిరుగుతున్నారు.

:: ప్రజాశక్తి - యంత్రాంగం ::

తాళ్లపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న తలారి వెంకట్రావు

గుర్తు గుర్తుంచుకోవాలి : కందుల

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రానున్న సార్వత్రిక ఎన్నికలలో నిడదవోలు నియోజకవర్గ ఓటర్లు తప్పనిసరిగా పార్టీ గుర్తును గుర్తుంచుకోవాలని జనసేన పార్టీ అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం ఉండ్రాజవరంలో టిడిపి నాయకులు గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద నిడదవోలు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత శేషారావు మాట్లాడుతూ పొత్తు ధర్మాన్ని నూటికి నూరు శాతం పాటించి దుర్గేష్ కు మద్దతుగా నిలవాలన్నారు. దుర్గేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ ఎంఎల్ఎ శేషారావు ముద్రను రానున్న కాలంలో కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. పొత్తులో భాగంగా నియోజకవర్గ సీటు జనసేనకు లభించిందన్నారు. బ్యాలెట్‌లో గాజు గ్లాసుకు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భోగవల్లి ప్రసాద్, సింహాద్రి రామకృష్ణ, వీరమళ్ల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలన నుంచి విముక్తి కోసమే...

ప్రజాశక్తి - తాళ్లపూడి

వైసిపి ప్రభుత్వ రాక్షస పాలన నుంచి విముక్తి కోసమే కూటమిగా పోటీ చేస్తున్నామని టిడిపి కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం అన్నదేవరపేటలో ఆయన పర్యటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని పలు దేవాలయాలను సందర్శించారు. ఆర్‌సిఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు జివి.ప్రసాద్, కాకర్ల సత్యేంద్ర, భరత్, గణపతి, అబ్బులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చాగల్లు** : సీనియర్ టిడిపి నాయకులు పెండ్యాల అచ్చిబాబు పిలుపు మేరకు బ్రాహ్మణగూడెంలో సమావేశం నిర్వహించారు. కూటమి అభ్యర్థిని గెలిపించాలని టిడిపి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, గాయత్రి వెంకటేశ్వరరావు, కె.సాహెబ్, జి.బాబూరావు, పికె.రంగారావు, పి.పోతురాజు, డి.రామకృష్ణ పాల్గొన్నారు.

బల్లిపాడులో తలారి ప్రజా ఆశీర్వాదయాత్ర

ప్రజాశక్తి - తాళ్లపూడి

బల్లిపాడులో వైసిపి కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి తలారి వెంకట్రావు ప్రజా ఆశీర్వాద యాత్రను శుక్రవారం నిర్వహించారు. తలారికి సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ పూల బొకేతో స్వాగతం పలికారు. సర్పంచ్ ఇంటి నుంచే తలారి యాత్ర సాగిది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, అమలుపై ఆరా తీస్తు యాత్ర సాగించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎఎంసి మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీను, మలకపల్లి సొసైటీ అధ్యక్షులు కుంటముక్కల కేశవనారాయణ, నాయకులు కల్లూరి మురళి, గనిశెట్టి బంగారాజు, కొయ్య దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కాపవరంలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - బిక్కవోలు

కాపవరం గ్రామంలో అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంఎల్ఎ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పోతుల ప్రసాద్‌రెడ్డి (బుజ్జి), ఎస్.వెంకటరమణ, వీరభద్రరావు, ఆర్.అప్పాజీ, సత్తి వీరలక్ష్మి,గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం వైపే ప్రజలు

ప్రజాశక్తి - రాజానగరం

అభివృద్ధి, సంక్షేమం వైపే ప్రజలు ఉన్నారని, తనపై తప్పుడు ప్రచారం చేసేవారికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు త్వరలోనే రానుందని రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో ముక్కినాడకు చెందిన టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఎంఎల్ఎ రాజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి వైసిపిలోకి వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీల్, ఎంపిటిసి సభ్యులు రామలక్ష్మి, అనదాసు సాయిరాం, అనదాసు సత్యనారాయణ, సోడాసాని సత్యనారాయణ, ఎం.లాజర్, నిత్యానందకుమార్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సింగవరంలో ఇంటింటా జనసేన..

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సింగవరం దుర్గమ్మ కాలనీలో జనసేన పార్టీ ఇంటింటా పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ యువ నాయకులు తోట పవన్‌కుమార్, తోట ప్రత్యూష హాజరయ్యారు. దుర్గమ్మ కాలనీలో ఇంటింటికీ తిరిగి గాజు గ్లాస్‌కు ఓటు వేసి బత్తుల బలరామకృష్ణని గెలిపించాలని కోరారు. అనంతరం యువ నాయకులు తోట పవన్ కుమార్ మాట్లాడారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, కరెంటు స్తంభాల సమస్య ఉందని, సీసీ రోడ్ల నిర్మాణం వంటి సమస్యలపై ప్రజల నుంచి వినతులు వస్తున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత కనబడుతుందన్నారు. అనంతరం సింగవరం సర్పంచ్ సంగన పోసియ్య మాట్లాడారు. గ్రామంలో సర్పంచ్‌గా టిడిపి నాయకులు ఎన్నిక కావడంతో అభివృద్ధి పనులకు సహకరించలేదన్నారు. కూటమి అభ్యర్థి బత్తుల బలరామకష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు, జనశ్రేణులు పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న చందన నాగేశ్వర్

వైద్యం కోసం చందన సాయం

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం జేగురుపాడుకు చెందిన పెనుమాక చంటి ఇటీవల వీరవరంలో గోడలకు సున్నాలు వేస్తుండగా మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ కింద పడిపోయాడు. ఆతనికి రెండు చేతులు, కాళ్లు విరిగిపోయాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యశ్రీ లేక, వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ స్పందించారు. అతని వైద్య ఖర్చులకు నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. విఎల్.పురం సెంటర్‌లోని వైసిపి కార్యాలయంలో ఈ సాయం అందించారు. ఈ సందర్భంగా చంటి కుటుంబ సభ్యులు చందన నాగేశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వేసవిలో భూసార పరీక్ష నిర్వహించాలి

ప్రజాశక్తి - చాగల్లు

వేసవిలో భూసారీ పరీక్షలు నిర్వహించాలని, సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాలు అందజేయాలని తూర్పుగోదావరి జిల్లా రైతు సంఘం కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు నిర్వహించట్లేదన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు అందించట్లేదన్నారు. ఈ ఏడాదైనా పూర్తిగా సబ్సిడీపై పచ్చిరొట్ల విత్తనాలు అందజేయాలన్నారు. వేసవిలో పనికి ఆహారం పథకం కింద ఎన్ఆర్‌జిఎస్ సిబ్బందితో మురుగు బోదెలు తవ్వించాలన్నారు. వర్షాకాలంలో పంటల ముంపును అరికట్టాలని కోరారు. ఈ మేరకు వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎవరి చరిత్ర ఏమిటో, ఎవరు ప్రజల మనిషో ప్రజలందరికీ తెలుసునని, జక్కంపూడి కుటుంబాన్ని విమర్శించే స్థాయి బత్తుల బలరామకృష్ణకు లేదని పలువురు వైసిపి నేతలు అన్నారు. చిల్లర రాజకీయాలు కట్టిపెట్టాలని హితవు పలికారు. బలరామకృష్ణ చేసిన ఆరోపణలపై వైసిపి నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కోరుకొండ ఎంఎల్ఎ కార్యాలయం వద్ద వైసిపి నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి సభ్యులు క్రి నాగేశ్వరావు మాట్లాడారు. తన పదవితో పోలిస్తే కూడా సరిపోని వ్యక్తి బత్తుల అని అన్నారు. ఇండిపెండెంట్‌గా పోటీచేస్తే కనీసం నాలుగు ఓట్లు కూడా బత్తులకు రావన్నారు. అదే రాజా ఇండిపెండెంట్‌గా చేస్తే ఆయన తండ్రి రామమోహనరావు ఎలా నెగ్గారో అలాగే రాజా విజయం సాధిస్తారన్నారు. అంతలా నియోజక వర్గ ప్రజలతో రాజా మమేకమయ్యారన్నారు. రాజకీయ నేపథ్యం గల కుటుంబం నుంచి రాజా వచ్చారని, బలరామకృష్ణ ఉద్యోగాలు అమ్ముకుని పైకి వచ్చిన వ్యక్తి అని అన్నారు. ఇద్దరికీ అసలు పోలికే లేదన్నారు. తనకన్నా స్థాయి తక్కువ గల వ్యక్తి గురించి మాట్లాడ్డానికి సిగ్గుపడుతున్నానని ఆయన అన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.ఈ సందర్భంగా మండల కో-కన్వీనర్ గణేశుల పోశయ్య మాట్లాడుతూ ప్రతిపక్ష స్థానంలో ఉన్నా సరే ప్రజలతో ఉన్న కుటుంబం జక్కంపూడి కుటుంబమన్నారు. ఏ ఆధారం ఉందని హైదరాబాద్ లిక్కర్ మాఫీయాతో సంబంధం ఉందని అంటున్నారని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లో హుందాగా ఉండాలి తప్ప స్థాయి మరిచి మాట్లాడడం తగదన్నారు. ఈ సందర్భంగా కొండపల్లి దుర్గారావు మాట్లాడుతూ బత్తుల మాటలు చూస్తుంటే మతి భ్రమించి మాట్లాడుతున్నట్లు ఉందన్నారు. గతం మర్చిపోయి ఇష్టం వచ్చినట్లు నోటి కొచ్చినట్లు మాట్లాడితే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వాకా నరసింహారావు, బి.బద్రి, కడియాల పాపారావు, టి.సత్యనారాయణ, కె.బాబ్జి, బి.చందు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న వైసిపినాయకులు

జనసేన అభ్యర్థి బత్తులకు వైసిపి నేతల హితవు

కాకినాడ రూరల్ సమస్యలపై ప్రత్యేక మేనిఫెస్టో

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సమస్యలపై ప్రత్యేకమైన మేనిఫెస్టోను రూపొందిస్తున్నట్లు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు తెలిపారు. శుక్రవారం రమణయ్యపేటలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులే విజయం సాధిస్తారన్నారు. కాపులకు ఎన్నో పథకాలు వారి అభివృద్ధికి నిధులు కేటాయించిన చంద్రబాబుకే కాపుల మద్దతు ఉంటుందని దాసు చెప్పారు. సరిగ్గా 43 ఏళ్ల క్రితం ఇదే రోజున టిడిపి ఆవిర్భవించిందని తద్వారా ఎందరికో రాజకీయాల్లో ఉన్నత స్థానం లభించిందన్నారు. అందరినీ మోసం చేసిన వైసిపి, జగన్ అండ్ కంపెనీకి వీడ్కోలు పలకాలని దాసు కోరారు. కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ, నురుకుర్తి వెంకటేశ్వరరావు, బసవా ప్రభాకరరావు, సిరంగు శ్రీనివాస్, మాధవరపు శ్రీనివాసరావు, జంక్షన్ బాబ్జి, దూడల నాగభూషణ్ పాల్గొన్నారు.

ఎంఎల్‌సిని స్థానికేతరుడు అనడం తగదు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎంఎల్‌సి అనంత ఉదయ భాస్కర్‌ను ఏలేశ్వరం నాయకులు స్థానికేతరుడు అనడం తగదని, వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల పార్టీకి రాజీనామా చేసిన ఏలేశ్వరం చైర్‌పర్సన్ ఎంఎల్‌సి పెత్తనం ఏమిటి అని ప్రశ్నిస్తున్నారని, ఉదయ భాస్కర్ ఉభయ గోదావరి జిల్లాల్లో ఎక్కడైనా ప్రచారం చేయవచ్చన్నారు. ఎంఎల్‌సి ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఏలేశ్వరం నగర పంచాయతీలో అవినీతిని బయటికి తీస్తామని, సామాన్యుడి ఇల్లు కట్టుకోవడానికి ప్లాన్ అప్రూవల్ నిమిత్తం రూ.లక్షలు గుంజేస్తున్నారని అన్నారు.

మామిడికుదురు మసీద్‌లో ముస్లింల నమాజు

మసీదుల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి -మామిడికుదురు

ముస్లింల పవిత్ర మాసమైన రంజాన్ లోని మూడవ శుక్రవారం నమాజ్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మామిడి కుదురులోని షియా జామియా మసీదు, సున్నీ జామియా మసీదు లలో ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా షబ్బర్ అలీ జయదీ, తారీక్ అన్వర్ రెజ్వి లు రంజాన్ మాసంలోని 18వ రోజు ప్రార్థనల ప్రాధాన్యతను వివరించారు. సుదూర ప్రాంతాల నుండి భక్తులు ఈ నమాజు ప్రార్థనలులో పాల్గొన్నారు. రెండు మసీదులు కూడా భక్తులతో కిటకిటలాడాయి.

ప్రకటన

మా క్లయింట్ అయిన **M/s. గోదావరి కోచింగ్ సెంటర్,** Rep. మేనేజింగ్ డైరెక్టర్, **దేశెట్టి లావణ్య,** W/o. **దేశెట్టి రాంబాబు,** రాజమండ్రి ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ **M/s. గోదావరి కోచింగ్ సెంటర్** పేరు మీద 2011 నుండి ఉపాధ్యాయ ఉద్యోగాలకు కోచింగ్ ఇస్తూ అనేక అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ వస్తున్నారు.

సంస్థ ఎదుగుదలను ఓర్వలేని కొందరు సంస్థపై దుష్ప్రచారం చేయడానికి ప్రయత్నించుచున్నారు అని తెలిసినది. గోదావరి కోచింగ్ సెంటర్ అను సంస్థపై గాని, సంస్థ యాజమాన్యంపై గాని ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని మార్ఫిడి ఆడియోలు (లేదా) వీడియోలు చేసి Whatsapp మరియు Facebook వంటి సోషల్ మీడియాలలో దుష్ప్రచారం చేసిన యెడల నా క్లయింట్ తీసుకొనే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురు అని తెలియజేయడమైనది.

రాజమండ్రి
30-3-2024

కె.భరణికుమార్
అడ్వకేట్, రాజమండ్రి

కోడ్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల సందర్భంగా కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంసిసి కన్వీనర్, ఎంపిడిఒ జి.ఉషారాణి అన్నారు. శుక్రవారం తాటిపర్తిలో ఆమె పోలింగ్ బూత్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ఆమె సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల కోడ్‌ను సమర్థవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వీప్ లక్ష్యంపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరిస్తూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.రాజశేఖర్, విఆర్ఒ వెంకటేశ్వరరావు, పంచాయితీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాపనమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మండపేట

పాలతోడు గ్రామ దేవత బాపనమ్మ అమ్మవారి ఆలయ 10వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత బాపనమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్త యేలేటి వెంకట్రావు దంపతులు, భక్తులు, దాతలు అమ్మవారికికి పూజలు నిర్వహించారు. అనంతరం కడియపులంక సత్యదేవ నర్సరీ అధినేత, డాక్టరేట్, భారత్ కళారత్న అవార్డు గ్రహీత పుల్లా సత్యనారాయణ చంటియ్యను సత్కరించారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు అన్నందేవుల గోపాలరావు, నిమ్మలపూడి వీరన్న చౌదరి, సరాకులు అబ్బులు, యేలేటి వీర్రాజు, యేలేటి ఆనందరావు, అన్నందేవుల బుజ్జి, దొడ్డ వీరవెంకటరావు, పిల్లా పుల్లయ్య, పిల్లా నాగేశ్వరరావు, యాదగని విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నేడు సామర్లకోటలో రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి-సామర్లకోట

సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సాల్మన్ రాజు, కార్యదర్శి డాక్టర్ వి.జాన్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం ఉదయం 6 గంటలకు స్థానిక సిబిఎం హైస్కూల్ గ్రౌండ్ నుంచి ప్రారంభించి లూథరన్ చర్చి, పోలీస్ స్టేషన్, పెన్షన్ లైన్, మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్ మీదుగా స్టేషన్ సెంటర్‌కు చేరుకుంటుందని, గాంధీబొమ్మ సెంటర్, బళ్లమార్కెట్, పాత ఎమ్మార్వో సెంటర్, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి మీదుగా సెంటినరీ బాప్టిస్ట్ చర్చికి చేరుకుని ముగియనున్నట్టు చెప్పారు.

St.John's College Of Education,
Rajamahendravaram, East Godavari District
(Affiliated to Adikavi Nannaya University, Approved by NCTE) Recognized by Govt., of A.P.

ADMISSION INTO B.ED. "B" CATEGORY & "A" CATEGORY SPOT SEATS

Applications are invited from the eligible candidates for B.Ed. Course Under Management Quota & Spot Admissions for the Academic year 2023-2024

College Status : **Non Minority**
Intake : **50**

COLLEGE VACANCY POSITION

Category A Left over Seats (Spot) : **28 + 5 (EWS)**
Category B Seats Management Quota : **12**

Eligibility - Bachelor Degree or P.G. with 50% marks for OC and 40% for BC, SC, ST With or Without Ed.CET-2023

Photo Copies : SSC, Intermetiate Marks, Degree or P.G Marks lists. O.Ds, Study Certificates (10th to Degree) and Caste Certificate, TC should be submitted to the college office by Personally between 10.00 A.M. to 4.00 P.M. or before 03-04-2024.

Contact : 93939 39789
93939 39678

Secretary & Correspondent
Date : 29-03-2024